RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 164 | జులై 15 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 164 | July 15 Wednesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


**కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూత**

2

# తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టులు



## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

తెలంగాణలో ప్రతిపాదిత వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సమావేశమైంది. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న వ్యూహాత్మక, వాణిజ్య ప్రాధాన్యతలను సీఎం ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి సుదీర్ఘంగా వివరించారు.

రోడ్డు, రైలు మార్గాల అనుసంధానంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి భారీ పరిశ్రమలతో వరంగల్ నగరం కీలక పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోందని సీఎం తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్టులో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవరాలింగ్), ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే భూసేకరణ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, 2028 జూన్ 2 నాటికి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఎయిర్‌పోర్ట్ డిజైన్లు కాకతీయ సంస్కృతి, వైభవాన్ని ప్రతిబింబించేలా ఉండాలని సీఎం ప్రతిపాదించగా, కేంద్ర మంత్రి అందుకు సుముకత వ్యక్తం చేశారు. అలాగే ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని ఎయిర్‌ఫీల్డ్‌తో పాటు పౌర విమానాశ్రయం (సివిల్ ఎన్‌క్లేవ్) నిర్మించాలని, దీనికి అవసరమైన భూమిని సేకరించి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక్కడ కూడా ఎంఆర్‌వో, కార్గో సదుపాయాలతో పాటు వరంగల్, ఆదిలాబాద్ రెండు చోట్లా విమాన శిక్షణ సంస్థలను (ఫ్లయింగ్ అకాడమీలు) ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా హైదరాబాద్ హుస్సేన్ సాగర్ నుంచి

➤ మిగతా 2వ పేజిలో..

# లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్

## పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ఎన్ఐఏ చర్యలు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి కేసులో లష్కరే తయ్యిబా (ఎల్‌ఈటీ) వ్యవస్థాపకుడు, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌పై ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జులై 8వ తేదీన కోర్టు ఈ వారెంట్‌ను జారీ చేయగా, ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఈ కేసును దర్యాప్తు చేస్తున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ).. జులై 6న ప్రత్యేక కోర్టులో హాఫీజ్ సయీద్‌పై పలు అభియోగాలతో కూడిన అనుబంధ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న సయీద్‌పై కఠినమైన ఉపా  చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లోని పలు కీలక సెక్షన్ల కింద ఎన్ఐఏ కేసులు నమోదు చేసింది. ఈ చార్జ్‌షీట్‌ను పరిశీలించిన న్యాయస్థానం.. నిందితుడిపై మోపిన అభియోగాలకు ప్రాథమికంగా తగిన ఆధారాలు ఉన్నాయని నిర్ధారించుకుంటూ కేసును విచారణకు స్వీకరించి, నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

గైర్హాజరీలోనే విచారణ (ట్రయల్ ఇన్ అబ్సెన్షియా):

పాకిస్థాన్ ఆశ్రయంలో ఉన్న హాఫీజ్ సయీద్ భారత్‌కు రాకపోయినప్పటికీ ఈ కేసు విచారణ

➤ మిగతా 2వ పేజిలో..

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

**దివిటిపల్లిలో అమరరాజా బ్యాటరీ ప్లాంట్ ప్రారంభోత్సవం**

**సీఎం రేవంత్ రెడ్డి ముమ్మర పర్యటన**




**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పలు కీలక పారిశ్రామిక, విద్యా రంగ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన అధికారిక షెడ్యూల్ ఖరారైంది. ముందుగా బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా రంగారెడ్డి జిల్లాలోని ఫ్యూచర్ సిటీకి సీఎం బయలుదేరుతారు. మధ్యాహ్నం 12:15 గంటల నుంచి 12:45 గంటల మధ్య ఫ్యూచర్ సిటీలో ప్రతిష్టాత్మక అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేస్తారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం

➤ మిగతా 2వ పేజిలో..

# టైఫూన్ 'బావి' బీభత్సం

**వరదల్లో కొట్టుకుపోతున్న వాహనాలు, చైనా అతలాకుతలం**



**బీజింగ్ జనసంఘర్షణ**

చైనాను శక్తివంతమైన టైఫూన్ 'బావి' వణికిస్తోంది. ఈ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా లియావోనింగ్ ప్రావిన్స్‌లో వరద ఉధృతి తీవ్రంగా ఉండటంతో అప్రమత్తమైన అధికారులు సుమారు 2,60,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రహదారులపై వరద నీరు ఉగ్రరూపం దాల్చడంతో కార్లు బొమ్మల్లా కొట్టుకుపోతున్న భీకర దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మంగళవారం కూడా పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చైనా జాతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దీంతో ముందస్తు జాగ్రత్తగా విద్యాసంస్థలన్నింటికీ సెలవులు ప్రకటించారు. దాదాపు 13 రోజుల క్రితం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్.. వైశాల్యపరంగా ఫ్రాన్స్ దేశమంత విస్తీర్ణాన్ని కలిగి ఉండటం దీని తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ తుఫాన్

➤ మిగతా 2వ పేజిలో..

# శంషాబాద్‌కు వియత్నాం నుంచి మృతదేహాలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**

వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకుల మృతదేహాలు మంగళవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్నాయి. కడప జిల్లాకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ మృతదేహాలు ఉదయం 7:30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్‌కు వచ్చాయి. ముంబైలో అవసరమైన అన్ని చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం అధికారులు ఈ భౌతికకాయాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యం చెప్పారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించే ప్రక్రియను మంత్రి స్వయంగా పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి కడప, మచిలీపట్నం, హిందూపురం ప్రాంతాలకు భౌతికకాయాలను ఉచితంగా తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించింది.

➤ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టులు

**మొదటిపేజీ తరువాయి..** విజయవాడ ప్రకాశం బ్యారేజీకి సీ–ప్లేన్ (నీటిపై ల్యాండ్ అయ్యే విమానం) సర్వీసులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ కోరగా.. దీనిపై తగిన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సూచించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని స్పష్టం చేశారు. విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, రాష్ట్ర పురోగతి కోసం తాము నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చించడం ద్వారా పరిష్కరించుకుంటున్నామని, దీనిపై రాజకీయ విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాల మధ్య గట్టి పోటీ ఉందని, అయితే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత వేగంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి చరిత్ర సృష్టించిందని అభినందించారు. ఇంత వేగంగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన రాష్ట్రాలు కూడా భూసేకరణ విషయంలో తెలంగాణను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, తెలంగాణ రహదారులు–భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్, కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి మురళీధర్ మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన భద్రత లక్ష్యంగా విదేశాంగ మంత్రి జైశంకర్ గల్ఫ్ పర్యటన: వివరాలు వెల్లడించిన రణధీర్ జైస్వాల్

**న్యూఢిల్లీ:** భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల గల్ఫ్ ప్రాంతంలోని నాలుగు దేశాల్లో జరిపిన పర్యటనలో 'ఇంధన భద్రత' అత్యంత కీలకమైన అంశంగా నిలిచిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనితో పాటు పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, వ్యూహాత్మక అంశాలపై కూడా విస్తృత చర్చలు జరిగాయని పేర్కొంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఈ నెల ప్రారంభంలో విదేశాంగ మంత్రి జైశంకర్ ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఒమన్ దేశాలలో పర్యటించి, ఆయా దేశాల అగ్ర నాయకత్వంతో పాటు తన సహచర మంత్రులతో విస్తృతస్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారని రణధీర్ జైస్వాల్ తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, భారత విదేశాంగ మంత్రి గల్ఫ్ దేశాల పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారతదేశ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలకమైన చమురు, గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవడానికి, అలాగే దేశ ఇంధన భద్రతను పటిష్టం చేసుకోవడానికి ఈ పర్యటన ఎంతగానో దోహదపడుతుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

## ఏపీలో ఓటర్ల జాబితా సవరణ గడువు జూలై 24 వరకు పొడిగింపు

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించింది. ఓటర్ల సవరణ గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సవరణ ప్రక్రియకు 2026 జులై 1వ తేదీని అర్హత తేదీగా (ఒుఋశ్రీఱటఎఱఅగ్ర ఙఛ్వ) నిర్ధారించారు. సవరించిన ఈ నూతన షెడ్యూల్ వివరాలను రాష్ట్రంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది.

సవరించిన షెడ్యూల్ ముఖ్యాంశాలు:

జూన్ 15 – జూలై 24: బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహిస్తారు. ఇదే గడువులోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది.

జూలై 31: ఓటర్ల ముసాయిదా (ఐతీఫుట్) జాబితా ప్రచురణ.

జూలై 31 – ఆగస్టు 30: ముసాయిదా జాబితాపై ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ.

సెప్టెంబర్ 28 లోగా: అందిన దరఖాస్తులు, అభ్యంతరాల పరిశీలన మరియు పరిష్కారం.

అక్టోబర్ 3, 2026: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన 'తుది ఓటర్ల జాబితా' అధికారికంగా విడుదల.

నిర్దేశిత గడువులోగా అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు మరియు చిరునామాల సవరణ ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్

**మొదటిపేజీ తరువాయి..** నిలిచిపోదు. దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టం 'భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (దీమీూా)–2023'లోని సెక్షన్ 356 ప్రకారం.. నిందితుడు అందుబాటులో లేనప్పటికీ (పారిపోయిన లేదా దాక్కున్న తరుణంలో) అతని గైర్హాజరీలోనే కోర్టు విచారణ జరిపి శిక్షను ఖరారు చేయవచ్చు. ఈ సరికొత్త నిబంధనల ఆధారంగానే హాఫీజ్ సయీద్‌పై భారత న్యాయస్థానం విచారణను ముందుకు తీసుకెళ్లనుంది.

## ఆషాఢ బోనాలకు పటిష్ట బందోబస్తు: షీ టీమ్స్ నిఘా, భక్తులకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**హైదరాబాద్:** ఆషాఢ బోనాల ఉత్సవాలను శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యంగా హైదరాబాద్ పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. బోనాల ఉత్సవాల్లో మొదటి 15 రోజులు అత్యంత కీలకమని, ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణపై పోలీస్ ఉన్నతాధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆషాఢ బోనాల భద్రతా ఏర్పాట్లపై ఆయన నగర పోలీస్ అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ, జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు నగరంలో ప్రత్యేక భద్రతా చర్యలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ముఖ్యంగా చారిత్రక గోల్కొండ ఎల్లమ్మ దేవాలయం, బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, పాతబస్తీ లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ , క్విక్ రియాక్షన్ టీమ్స్‌లను భారీగా రంగంలోకి దించుతున్నట్లు వెల్లడించారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేందుకు ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ముఖ్యంగా మహిళా భక్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆలయ పరిసరాల్లో 'షీ టీమ్స్' (రాష్ట్రవ ఎఝుఎం) నిరంతరం నిఘా ఉంచుతాయని సీపీ స్పష్టం చేశారు. ఈవ్‌టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగతనాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గత ఏడాది బోనాల ఉత్సవాల్లో దాదాపు 644 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, ఘటాల తరలింపు, పోతురాజుల విన్యాసాల సమయంలో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఆలయాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## పంటలకు నీరివ్వాలని డిమాండ్: అమలాపురంలో రైతుల ఆందోళన

పంటలకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కోనసీమ జిల్లా అమలాపురంలోని నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) కార్యాలయాన్ని మంగళవారం రైతులు ముట్టడించారు. కాలువల ఆధునికీకరణ పనుల సాకుతో నీటి సరఫరాను నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు.. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ) చాంబర్ ముందు బైఠాయించారు. కాంట్రాక్టర్ ప్రయోజనాల కోసం అధికారులే కావాలని నీటిని ఆపేసి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ క్రమంలో ఆందోళనకారులు డీఈ కార్యాలయానికి తాళం వేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య నెట్టులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. అనంతరం అక్కడికి చేరుకున్న ఇరిగేషన్ డీఈ కె. శ్రీరామ జనార్దన్ రైతులతో చర్చలు జరిపారు. గురువారం సాయంత్రం లోగా పంట కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

# టైఫూన్ 'బావి' బీభత్సం

**మొదటిపేజీ తరువాయి..** ప్రభావం కేవలం చైనాపైనే కాకుండా జపాన్, తైవాన్, ఫిలిప్పీన్స్, ఉత్తర కొరియా దేశాలపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

**మొదటిపేజీ తరువాయి..** 1:15 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 1:20 నుంచి 2:20 గంటల మధ్య అత్యంత ఆధునిక సాంకేతికతతో నిర్మించిన అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ (బ్యాటరీ) ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్లాంట్‌ను సందర్శించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు.

దివిటిపల్లి కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2:40 గంటలకు వనపర్తి జిల్లా కొత్తకోటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల మధ్య కొత్తకోటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి, అక్కడ పాఠశాల విద్యార్థినులతో ముఖాముఖి (ఇంటరాక్షన్) కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాలన్నీ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 3:45 గంటలకు కొత్తకోట నుంచి తిరుగుపయనమై హైదరాబాద్ చేరుకుంటారు. ఒకేరోజు రెండు భారీ పారిశ్రామిక ప్రాజెక్టులతో పాటు ఒక విద్యా సంస్థ భవన ప్రారంభోత్సవం చేస్తుండటంతో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

## కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూత

కాకినాడ: ప్రముఖ కాపు సామాజిక వర్గ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలియడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ముద్రగడ పద్మనాభం స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి. 1953 జనవరి 22న జన్మించిన ఆయన.. తన తండ్రి వీరరాఘవరావు మరణానంతరం 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. దాదాపు ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయన తనదైన ముద్ర వేశారు.

రాజకీయ ప్రస్థానం – ముఖ్యాంశాలు:

తొలి విజయం: 1978లో జనతా పార్టీ తరఫున ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

టీడీపీలో చేరిక: 1982లో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన.. 1983, 1985, 1989 శాసనసభ ఎన్నికల్లో ప్రత్తిపాడు నుంచి వరుసగా విజయం సాధించి మొత్తం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా సేవలు అందించారు.

మంత్రిగా సేవలు: దివంగత ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత టీడీపీకి, మంత్రి పదవికి రాజీనామా చేసి 'ప్రజారక్షణ సమితి', 'తెలుగునాడు' పార్టీలను స్థాపించారు.

ఎంపీగా ప్రస్థానం: 1999 లోక్‌సభ ఎన్నికల్లో కాకినాడ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత వివిధ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజారాజ్యం, కాంగ్రెస్ పార్టీలలో పనిచేశారు. 2024 ఎన్నికలకు ముందు ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (ౌ=జూ) లో చేరారు.

కాపు ఉద్యమ వారధి:

ఆంధ్రప్రదేశ్‌లో కాపు సామాజిక వర్గానికి బీసీ రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ముద్రగడ సుదీర్ఘ పోరాటం చేశారు. రాష్ట్రంలో కాపు సామాజిక వర్గాన్ని ఏకం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 1994లో చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆ తర్వాత 2016 జనవరి 31న తునిలో నిర్వహించిన 'కాపు ఐక్య గర్జన' సభ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది.

ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నిరుపేదల పక్షాన, తన సామాజిక వర్గ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప నేతను కోల్పోయామని వారు కొనియాడారు.

# తెలంగాణలో నిర్మించనున్న వరంగల్, అదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణంలో నిర్మించాలి

❑ కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి విజ్ఞప్తి

వరంగల్/జూలై 14/(జన సంఘర్షణ)

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి, పౌర విమానయాన శాఖ కార్యాలయంలో కేంద్రమంత్రితో సమావేశమై రెండు విమానాశ్రయాలపై చర్చించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండ జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని తెలిపారు. వరంగల్ ఎయిర్ పోర్టు, రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో నగరం కీలకంగా మారుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింతగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్



నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. అందుకు కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వరంగల్ విమానాశ్రయం తరహాలోనే ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు నెలకొల్పాలని కోరారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలన్న ముఖ్యమంత్రి సూచనలపై అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్-



అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావుతో పాటు పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మీడియాతో వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచారలోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని చెప్పారు.దేశంలో ఎక్కడా లేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు అభినందించారు. భూ సేకరణ విషయంలో త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని చెప్పారు.

# బాన్సువాడ మాతా శిశు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యమా?

❑ బాలింతల ఆరోగ్య సమస్యలపై బీఆర్ఎస్ ధర్నా

బాన్సువాడ, /జూలై 14/(జన సంఘర్షణ)

బాన్సువాడ మాతా శిశు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఖలీల్ మాట్లాడుతూ.. గత శుక్రవారం, శనివారం రెండు రోజులలో పదిమంది గర్భిణీలకు సిజేరియన్ శస్త్రచికిత్సలు నిర్వహించారని తెలిపారు. వారిలో ఐదుగురు బాలింతలు శస్త్రచికిత్స అనంతరం అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. బాలింతలకు రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించినప్పటికీ, సకాలంలో రక్తం ఎక్కించలేదని, దీంతో వారి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించిందని పేర్కొన్నారు. అనంతరం కిడ్నీలలో ఇన్ఫెక్షన్, వాపు వంటి సమస్యలు తలెత్తడంతో బాధితులను మొదట నిజామాబాద్కు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్కు తరలించారని చెప్పారు. ముగ్గురు బాలింతలకు డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనికి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. మాతా శిశు ఆసుపత్రిలో కనీస వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేవని ఖలీల్ విమర్శించారు. అవసరమైన మందులు కొరతగా ఉన్నాయని, వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని, గర్భిణీలు మరియు నవజాత శిశువులకు అవసరమైన పరీక్షలు, టీకాలు సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. తాగునీటి వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా సరిగా లేవని అన్నారు. ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం




ఇవ్వాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి పరిస్థితులు ఉండటం ఆందోళనకరమని పేర్కొన్న ఆయన, ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు, అవసరమైన మందులు, ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పసిపాపపై పాశవికం మృగానికి జీవిత ఖైదు

❑ 3 ఏళ్ల చిన్నారిపై అమానుష అఘాయిత్యం..నిందితుడికి జీవిత ఖైదు.

❑ ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పు రూ.10 వేల జరిమాన.

❑ బాధిత చిన్నారికి రూ.5 లక్షల పరిహారం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 14 (జన సంఘర్షణ)

శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, దర్యాప్తు అధికారులు,పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, 3 సంవత్సరాల పసి బాలికపై జరిగిన అమానుష లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.జిల్లా ఎస్పీ వివరాల ప్రకారం మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కలకల్ గ్రామంలో 2025 మార్చి 10న ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఎప్పటిలాగే అమాయకంగా అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన 3 ఏళ్ల చిన్నారి కొద్ది సేపటికే కనిపించకుండా పోయింది. అంగన్‌వాడీ టీచర్ చిన్నారి తండ్రికి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో అక్కడికి చేరుకుని చిన్నారి కోసం గాలింపు చేపట్టారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, బీహార్ రాష్ట్రానికి చెందిన తున్న కుమార్ (20) అనే వ్యక్తి చిన్నారిని ఎత్తుకుని తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. ప్రాణం అరచేతిలో పెట్టుకుని వెతికిన కుటుంబ సభ్యులకు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద చిన్నారి ఏడుపు వినిపించింది. అక్కడికి చేరుకునే సరికి వారిని గమనించిన నిందితుడు పరారయ్యాడు. భయంతో, వేదనతో ఉన్న చిన్నారిని వెంటనే రక్షించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేశారు. తూప్రాన్ డీఎస్పీలు వెంకట్ రెడ్డి, నరేందర్ గౌడ్ కేసును అత్యంత ప్రాధాన్యంతో దర్యాప్తు చేసి, శాస్త్రీయ ఆధారాలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు తదితర పటిష్టమైన సాక్ష్యాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేత చిన్నారి మానసిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు సిద్ధం చేశారు. సమర్పించిన అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు తున్న కుమార్ ను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే బాధిత చిన్నారికి రూ.5 లక్షల విక్టిమ్ కాంపెన్సేషన్ మంజూరు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ కేసులో లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీవో మహిపాల్ రెడ్డి సమన్వయంతో పనిచేశారు. నిందితుడికి శిక్ష




పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, దర్యాప్తు అధికారులు, భరోసా బృందం, లైజనింగ్ ఆఫీసర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.ఈ ఘటన ఒక కుటుంబానికే కాదు, సమాజానికే తీవ్ర వేదన కలిగించేదని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ప్రతి చిన్నారి భద్రత సమాజం, తల్లిదండ్రులు, పోలీస్ వ్యవస్థల ఉమ్మడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# తహసిల్దార్‌కి బిజెపి నాయకులు వినతిపత్రం అందజేత

పోతంగల్/ జూలై 14/(జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో మంగళ వారం రోజున బిజేపి నాయకుడు భజరంగ్ హనుమంతు మాట్లాడుతూ.. రైతులు వర్షాకాలం వర్షాలు కురుస్తాయని నమ్మకంతో వరి నాట్లు వేసుకున్నారు వర్షాలు లేక వాతావరణం అనుకూలించక ప్రజలు నా నా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ శాఖ వారు నాణ్యమైన విద్యుత్ అందించాలి, విద్యుత్ లో బాగా అంతరాయం వస్తుంది. విద్యుత్ శాఖ వారు అంతరాయం లేకుండా చూడాలి. అంతరాయం వస్తే వెంటనే ఆ అంతరాయాన్ని నిర్మూలన చేసి రైతులను ఆదుకోవాలి. పోతంగల్ గ్రామంలో ఫ్లోరైడ్ స్కీము నిర్మించారు. అది చాలా సంవత్సరాల నుండి నిరుపయోగంగా ఉంది. దానికి మరమ్మతులు చేసి వెంటనే వాడుకోవడానికి ఉపయోగపడేలా చేయాలి. ఆ విధంగా చేసినట్లయితే రైతులు నీటి సమస్య నుంచి కొంచెం ఇబ్బందుల పాలు కాకుండా ఉంటారు అని చెప్పారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సందీప్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్

❑ ఇంజనీర్ నివాసంలో నోట్ల కట్టలు...

పెద్దపల్లి/జూలై 14/(జన సంఘర్షణ)



కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు మంజూరు కోసం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఇంజనీర్. పెద్దపల్లి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఇ) కల్లెపల్లి సతీష్ కుమార్ రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా మంగళవారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బల్దియాలో తొమ్మిదవ ఫైనాన్స్ నిధులు( టియుఎఫ్ఐడిసి) కింద మంజూరైన స్మశాన వాటిక నిర్మాణం చేసిన కాంట్రాక్ట్ పనుల తాలూకు రూ.12,28,748 బిల్లుల కోసం ఎఇ సతీష్ ను సంప్రదించారు. రూ.4 లక్షల లంచం ఇస్తేనే బిల్లులు మంజూరు జరుగుతుందని ఎఇ చెప్పడంతో కాంట్రాక్టర్ ఎసిబిని ఆశ్రయించారు. కరీంనగర్ ఎసిబి డిఎస్పీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తన కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సతీష్ ను పట్టుకున్నారు. సతీష్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు రూ.32.31 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎఇ సతీష్‌ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని అధికారులు తెలిపారు. బల్దియా కార్యాలయంతో పాటు సతీష్ ఇండ్లలో సోదాలు కొనసాగుతున్నాయి.

# ఎస్సై ను సన్మానించిన గ్రామ పెద్దలు ముదిరాజ్ సంఘం నాయకులు

కోటగిరి /జులై 14/(జన సంఘర్షణ)




కోటగిరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో కొత్తపల్లి గ్రామ పెద్దలు ముదిరాజ్ సంఘం నాయకులు ఎస్సై జి. శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పరిచయాలు చేసుకొని పలు విషయాలపై చర్చించారు. గ్రామాలలో ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా సహాయ సహకారాలు కోటగిరి పోలీసు శాఖ ద్వారా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ మాజీ చైర్మన్ వెల్లంకి నారాయణరావు, కోటగిరి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పి. సైదయ్య, మాజీ ఏఎంసి డైరెక్టర్ కోటగిరి సుదర్శన్, ముదిరాజ్ సంఘం నాయకులు సాలూరి పెద్ద రాజన్న, ఇట్టే గంగారం, సతీష్, గణేష్, చలపతిరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలి

❑ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్ రాజ్

బాన్సువాడ/, జూలై 14: /(జన సంఘర్షణ)




బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్ రాజ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌ను సందర్శించిన ఆయన అక్కడి నుంచి జరుగుతున్న నీటి శుద్ధి, సరఫరా విధానాన్ని పరిశీలించారు. ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు నిరంతరంగా అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి శుద్ధి ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పంపిణీ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు త్రాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. వీరితో మున్సిపల్ కౌన్సిలర్ ఖలేఖ్ బోడ భాస్కర్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# హెచ్ఎండిఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ నివాసంలో ఏసీబీ సోదాలు

హైదరాబాద్ గచ్చిబౌలి/జూలై14/(జన సంఘర్షణ)



హెచ్ఎండిఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ నివాసంలో మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏకకాలంలోనే 15 బృందాలతో సోదాలు నిర్వహించిన ఎసిబి అధికారులు. హెచ్ఎండిఏ కార్యాలయంలో సైతం ఎసిబి అధికారులు. గచ్చిబౌలి సుమధుర టవర్స్లో నివాసముంటున్న బచ్చు రవీందర్. బచ్చు రవీందర్ బంధువుల ఇళ్లల్లో కూడా ఏసిపి అధికారులు సోదాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థిరస్తులు, బ్యాంకులో నాలుగు లాకర్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు సోదాలు వెలుగు చూశాయి. సాయంత్రం వరకు బచ్చు రవీందర్ ఇళ్లల్లో, కార్యాలయంలో, బంధువుల ఇళ్లల్లో సోదాలు కొనసాగాయి. ఆదాయం నుంచి ఆస్తులు కూడా పెట్టుకున్నారన్న ఆరోపణపై ఏసీబీ అధికారులు హెచ్ఎండిఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ కార్యాలయంలో సోదాలు కొనసాగాయి.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
బుధవారం
15 జులై 2026

## కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేష్ చంద్ర ఆకస్మిక తనిఖీ..

❑ సిబ్బందికి కీలక ఆదేశాలు

కామారెడ్డి జిల్లా/, జూలై 14 /(జన సంఘర్షణ)



కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) రాజేష్ చంద్ర మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని రికార్డులను పరిశీలించి, ఇటీవల నిర్వహించిన కార్డన్ సెర్చ్ స్వాధీనం చేసుకున్న పత్రాలు లేని వాహనాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఎస్పీ, పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి బాధితుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించి పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసులను నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించిన ఎస్పీ, అత్యవసర సేవల కోసం డయల్-100కు వచ్చే కాల్స్కు వెంటనే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు ఆదేశించారు. అలాగే, జిల్లాలో అమలు చేస్తున్న ఆపరేషన్ కవచ్లో భాగంగా గస్తీని మరింత పెంచి, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని, రాత్రి వేళల్లో వాహన తనిఖీలు, పెట్రోలింగ్ను ముమ్మరం చేయాలని సూచించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణ, ఆస్తుల భద్రత, సిబ్బంది పనితీరుపై ఎస్పీ రాజేష్ చంద్ర సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, టౌన్ సీఐ నరహరి, ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

❑ మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 14 (జన సంఘర్షణ)



అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు అండగా ఉండేందుకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామాయంపేటలో అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది లబ్ధిదారులకు మొత్తం నాలుగు లక్షల 83 వేల రూపాయలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా రామాయంపేట కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు చింతల స్వప్న స్వామి మాట్లాడుతూ పేద ప్రజల వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సార్గు భూమయ్య, సార్గురాములు, కొండ లలిత,చింతల స్వామి, తదితరులు పాల్గొడం జరిగింది.

## టిఎస్ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

❑ కార్మికుల హక్కుల పరిరక్షనే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 14: (జన సంఘర్షణ)






తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వం యూనియన్ తీసేందుకు కుట్రచేస్తుందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న విమర్శించారు. సోమవారం మెదక్ పట్టణంలోని టీఎన్జీవోభవన్లో ఎంప్లాయిస్ యూనియన్ మెదక్ రీజియన్ మహాసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వెంకన్న మాట్లాడుతూ ఎర్రజెండ్ ద్వారానే కార్మికుల హక్కులు పరిష్కరించబడతాయన్నారు.కార్మికుల హక్కుల పరిరక్షనే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యమన్నారు. కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మెజార్టీ బస్సులు స్క్రాప్ దశకు చేరాయని, వాటి స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు సేవలందించాలన్నారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ ఆర్టీసీ కార్మికులకు కల్పించాలన్నారు.సేవా సంస్థలను లాభాల దృష్టిలో చూడొద్దని, ప్రజలకు ఏ విదంగా సేవలు అందుతున్నాయో చూడాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం, కార్పొరేషన్ ఇవ్వాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులపైఅధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే ఆర్టీసీ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వివిధ డిపోల ఇతర యూనియన్‌లలో నుండి కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న సమక్షంలో వందల సంఖ్యలో ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ మెదక్ రిజియన్ నాయకులు ఎన్ ప్రసాద్ రెడ్డి, టిఎల్ రావు, జి . శేషు, మెదక్ డిపో గౌరవ అధ్యక్షులు సుభాష్ చంద్ర భోస్, మెదక్ డిపో నాయకులు సర్వన్, కిష్టయ్య, అనంతం, మల్లేష్, దేవేందర్ గౌడ్, శేఖర్ గౌడ్, ఆంజనేయులు యేసు, షకీల్, శేఖమ్మ, శ్రవంతి, భాగ్యమ్మ, మేనక, నరేందర్ వివిధ డిపోల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

బాన్సువాడ:/జూలై 14/( జనసంఘర్షణ)



సీఎం రేవంత్ రెడ్డి (జవీ రాజకీయ ప్రత్యర్థులు, రైతులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు హింసను, ఆత్మహత్యలను ప్రేరేపించేలా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**సీఎం పదవిలో ఉండి......**

రాజ్యాంగబద్ధమైన సీఎం పదవిలో కొనసాగుతున్న వ్యక్తి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజల్లో ఉద్రిక్తతలకు దారితీసేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు హింసను ప్రేరేపించేలా కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, సీఎం వ్యాఖ్యలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, ఎర్రవట్టి సాయిబాబా, కౌన్సిలర్ మక్బూల్, మాజీ వార్డు సభ్యులు శ్రీను, అక్బర్, ఫిరోజ్, ఖలీల్, మోచి గణేష్, రమేష్ యాదవ్, చాకలి సాయిలు, శివ సూరి, రహీం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ యువజన నేత శశికాంత్ జన్మదినం పురస్కరించుకొని మహా అన్నదానం

బీర్కూర్ /జూలై 14 /(జనసంఘర్షణ)







కొంతమంది జన్మదినం వేడుకలు వచ్చాయంటే ఎంతో అంగరంగ వైభవంగా మటన్, చికెన్ మద్యంతో గడుపుకుంటారు. లక్షల రూపాయలు వీటి కోసం ఖర్చు చేస్తుంటారు. కానీ కామారెడ్డి జిల్లా బీర్కూర్ కాంగ్రెస్ యువజన నాయకుడు శశికాంత్ తన జన్మదినం సందర్భంగా మంగళవారం బీర్కూర్ హనుమాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకంటే ముందు హనుమాన్ ఆలయంలో శశికాంత్, తన అనుచరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు తరలివచ్చి అన్నదాత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న శశికాంత్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

## ద్వారక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్వారా అన్న ప్రసాదన వితరణ

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 14 (జన సంఘర్షణ)




ప్రతి అమావాస్య సందర్భంగా మెదక్ జె.ఎన్. రోడ్డులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాద్యం బాలకృష్ణ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు కానుగు భూపతి రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజున నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్న ధ్వారాక చారి ట్రబుల్ ట్రస్ట్ ధ్వారా చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. మాద్యం బాలకృష్ణ అన్నను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం అత్యంత పుణ్య కార్యమని, బాలకృష్ణ చేస్తున్న ఈ సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బట్టి ఉదయ్ కుమార్, ఇప్ప భరత్, పబ్బా లక్ష్మణ్, శివ ఆంజనేయులు, గోల్డ్ సుమన్, రాజ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నమస్తే డే కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

❑ ఆయుష్మాన్ భారత్ కార్డుల అందజేత.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 14 (జన సంఘర్షణ)





నమస్తే డే కార్యక్రమంలో భాగంగా మంగళవారంరోజున మెదక్ పురపాలక కార్యాలయంలో పారిశుద్ధ్యకార్మికులకు మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నవీన్ కలిసి పారిశుద్ధ్య కిట్లను పంపిణీ చేశారు. అనంతరం అర్హులైన పారిశుద్ధ్య కార్మికులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా అర్హులైన లబ్ధిదారులు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


## మిషన్ భగీరథ పైప్ లైన్‌కు లీకేజీ..

❑ నీటి సరఫరాకు అంతరాయం

బాన్సువాడ/జూలై 14/( జనసంఘర్షణ)

బాన్సువాడ పట్టణంలో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడనుంది.

**మూడురోజుల పాటు....**



భగీరథ పైప్లైన్కు లీకేజీ ఏర్పడడంతో తాగునీటి సరఫరాను మూడు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపి వేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. పైపులైన్ మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు తాగునీటి అవసరాల కోసం స్థానికంగా ఉన్న మున్సిపాలిటీ బోర్లను వినియోగించుకోవాలని సూచించారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని కమిషనర్ వెల్లడించారు. ప్రజలు సహకరించి, నీటిని పొదుపుగా వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డా.రాములు

❑ పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ డీఎంఈ ఉత్తర్వులు..

నిజామాబాద్/ జూలై 14 /(జనసంఘర్షణ)




నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా అర్థోపెడిక్ విభాగం అధిపతి ప్రొ. డా. ఎల్. రాములును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొన్నటి వరకు పని చేసిన శ్రీనివాస్ స్థానంలో రాములు ఇంచార్జిగా వ్యవహరించిన విషయం తెల్సిందే. ఇటీవల జరిగిన బదిలీల్లో సీనియర్ ప్రొఫెసర్లు ఎవరిని కూడా కేటాయించకపోవడంతో ఇంచార్జిగా ప్రొ. రాములుకే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దాదాపు దశాబ్ద కాలంగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి రెగ్యులర్ సూపరిండెంటెండ్ గా నియామకాలు జరుగడం లేదు. ప్రస్తుతం ఇంచార్జి సూపరింటెండెంట్ గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన డా.రాములు గతంలోనూ 2017, 18, 19లో సూపరింటెండెంట్ గా పని చేసిన అనుభవం ఉంది. ఇటీవల కాలంలో ప్రొఫెసర్లు బదిలీ అయిన తర్వాత పూర్తి బాధ్యతలను అప్పగించేందుకు డిఎంఈ ఆసక్తి కలిగిన ప్రొఫెసర్ల జాబితా కోరింది. ఎవరు కూడా ముందుకు రాకపోవడంతో ఇంచార్జిగా ఉన్న రాములుకే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం డా.రాములు పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆసుపత్రి అధికారులతో పాటు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఏడి సునీత, మెడికల్ కాలేజి సూపరింటెండెంట్ పెద్దోళ్ళ నాగరాజు లు స్వాగతం పలికారు. ఆగస్టు మాసంలో పదోన్నతుల సమయంలో జీజీహెచ్ కు సూపరింటెండెంట్ ను నియమించే అవకాశమున్నట్టు తెలిసింది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక


## రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది

- **ఎస్ ఐ ఆర్ జిల్లా కన్వీనర్ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు అన్నారు.**

జూలై 14: (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ప్రక్రియ వేగంగా, సమర్థవంతంగా కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని పలు బూత్‌లను సందర్శించి పరిశీలించిన సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఎంతో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ,అనేక బూత్‌లలో సుమారు 60 శాతం వరకు ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమైన విషయం.భారతీయ జనతా పార్టీ తరఫున బీఎల్ఓలు చేస్తున్న కృషిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము. అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భారతీయ జనతా పార్టీకి చెందిన బీఎల్ఏ2లు కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారు. నాలుగో వార్డును పరిశీలించినప్పుడు మొత్తం 1,276 మంది ఓటర్లలో 541 మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయబడ్డాయి. పంపిణీ చేసిన 200 ఫారాల్లో ఇంకా కొంతమంది నమోదు చేయాల్సి ఉండగా, 42 మరణించిన ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ కూడా చేపట్టడం జరిగింది. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్ఓల పనితీరు ఎంతో ప్రశంసనీయంగా ఉందని పేర్కొంటూ, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు అందరూ పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

## బార్బర్ షాప్‌లో చోరీ

- **తొనిగండ్ల గ్రామానికి చెందిన మంగలి అంజయ్య బార్బర్ షాప్ లో దొంగతనం.**
- **త్వరలో పట్టుకుంటాం పోలీసులు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 14 (జన సంఘర్షణ)

పెద్దన్న గారి అంజయ్య గ్రామం తొనిగండ్ల గత కొన్ని రోజుల నుండి లక్ష్మాపూర్ గేట్ దగ్గరలో బార్బర్ షాప్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తేదీ 13 07 2026 నాడు రాత్రి ఎనిమిది గంటల సమయంలో అతని కొడుకు రోజు మాదిరిగా అతని షాప్ క్లోజ్ చేసి ఇంటికి వెళ్ళినాడు. తిరిగి ఈరోజు ఉదయం 8 గంటలకు వారి షాపు వద్దకు వెళ్లి చూడగా రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బార్బర్ షాప్ యొక్క వెనక డోర్ బ్రేక్ చేసి షాప్ లోకి ప్రవేశించి షాప్ లో ఉన్నటువంటి రెండు ట్రిమ్మర్లు ఒక సెల్ ఫోన్, కొంత నగదు దొంగలించక పోయినారు. దొంగలించకపోయిన పూర్తి వస్తువుల విలువ పంతొమ్మిది వేల వరకు ఉంటుందని దరఖాస్తు ఇవ్వగా నేరస్తుల ఆచూకీ తెలుసుకోకుండా గాను క్లూస్ టీం ను తప్పించి నేర స్థలాన్ని పరీక్షించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రమాదాలకు చెక్..

- **వై జంక్షన్‌లో అండర్‌పాస్.**
- **రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని ఎన్‌హెచ్ఏఐ హామీ.**
- **వై జంక్షన్ అండర్‌పాస్‌కు బీఆర్ఎస్ పోరాటమే ఫలితం.**
- **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.**



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 14 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ ప్రవేశ ద్వారం వద్ద ఆద్య హోటల్ సమీపంలోని వై జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణానికి మార్గం సుగమం కావడం బీఆర్ఎస్ చేపట్టిన నిరంతర ఉద్యమాల ఫలితమేనని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయంలో రీజినల్ ఆఫీసర్ శివశంకర్‌ను మంగళవారం కలిసి వై జంక్షన్ సమస్యపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈసందర్భంగా మాట్లాడుతూ..వై జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ సమస్యను పలుమార్లు ప్రభుత్వంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు అండర్‌పాస్ నిర్మాణానికే ఏకగ్రీవంగా మద్దతు తెలిపారని చెప్పారు. ప్రమాదాల్లో కుటుంబ పెద్దలను కోల్పోయిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోమటిపల్లి నుంచి కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వరకు సుమారు కిలోమీటరు మేర అండర్‌పాస్ నిర్మించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దీంతో కోమటిపల్లి, గొల్లపర్తి, కేసీఆర్ కాలనీ ప్రజలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ విద్యార్థులకు సురక్షిత రాకపోకలు కలుగుతాయని పేర్కొన్నారు. వై జంక్షన్‌ను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినప్పటికీ ఇంతకాలం అండర్‌పాస్ మంజూరు కాకపోవడం బాధాకరమని అన్నారు. అయితే టెండర్ ప్రక్రియ పూర్తైందని, మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ముందుండి పోరాటం కొనసాగిస్తుందని, ప్రజా ప్రయోజనాల కోసం ఉద్యమాలు ఆగవని పద్మా దేవేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, కౌన్సిలర్లు చౌదరి చరిత, కొక్కు ప్రవీణ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉమామహేశ్వర్, హస్నొవుద్దీన్, రొయ్యల నవీన్, దోమకొండ శ్రీనివాస్, రాచూరి శ్రీనివాస్, నీల రాజు, బాసం శీను, వంశీ, దాకి బునీత్, తాటిపల్లి రామ్‌కీ, శ్రీకాంత్ సాగర్, శ్రావణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు కోట్ల తొంభైముడు లక్షలతో మెదక్ అభివృద్ధి పనులు

- **ప్రతి వార్డుకు సమాన అభివృద్ధే లక్ష్యం..**
- **మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.**
- **ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.**
- **మెదక్ అభివృద్ధికి మరో ముందడుగు పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు శంకుస్థాపన.**






ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 14(జన సంఘర్షణ)

మెదక్ పట్టణ రూపురేఖలు మారుతున్నాయి. కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు. రోడ్లు,డ్రైనేజీలు, మౌలిక వసతులతో ఆదర్శ పట్టణంగా మెదక్‌ను తీర్చిదిద్దుతాం ఎమ్మెల్యే మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. మెదక్ శాసనసభ్యుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పట్టణంలోని 31, 30, 23, 22, 20, 16, 17, 18, 19, 21, 28 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అభివృద్ధి కార్యక్రమాలకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ.. మెదక్ ప్రజలు నాపై ఉంచిన విశ్వాసాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించడం నా బాధ్యత. పట్టణంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తూ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం నా లక్ష్యం. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని రంగాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. గతంలో ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మెదక్ పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కోట్ల రూపాయల నిధులను తీసుకువస్తున్నామని తెలిపారు. అభివృద్ధి అనేది కేవలం హామీలతో కాకుండా పనులతో కనిపించాలనే ఉద్దేశంతో నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యలను స్వయంగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. "ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే నా ధ్యేయం. ఏ వార్డు వెనుకబడకుండా ప్రతి ప్రాంతంలో సమానంగా అభివృద్ధి జరుగుతుంది. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించి మెదక్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలబెడతాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా పనుల నాణ్యతను పరిశీలిస్తూ తమ సూచనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో బోధన్ గురుకుల విద్యార్థుల జోరు

- **బోధన్ నిజామాబాద్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బోధన్ మైనార్టీ గురుకుల విద్యార్థులు నవీన్, సయ్యద్, విష్ణు ప్రతిభ.**

బోధన్/జులై 14 /(జనసంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా బోధన్ మైనార్టీ గురుకుల విద్యార్థులు గోల్డ్ మేడల్‌కు ఎంపికైనట్లు గురుకుల ప్రిన్సిపల్ ఇంతి యాజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈ అథ్లెటిక్స్ లో బోధన పట్టణంలోని మైనార్టీ గురుకుల విద్యార్థులు క్రీడల్లో పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు. ఈపోటీల్లో రాష్ట్రస్థాయికి క్రీడాకారులు ఎంపిక అవ్వడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ తోపాటు పీఈటి ఏంబరి సందీప్, సుధాకర్ లు క్రీడాకారులను ప్రశంసించి సత్కరించారు. 1000 మీటర్ల నుండి 1500 వరకు పరుగు పందెంలో పాల్గొని రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలో ఎంపికైన క్రీడాకారులు బంగారుపథకాలు సాధించడం పట్ల పాఠశాల తో పాటు బోధన్ విద్యాసంస్థలు అభిందించాయి. ఎంపికైన వారిలో నవీన్ టెన్త్ క్లాస్,సయ్యద్ టెన్త్ క్లాస్లు చదువుతున్న క్రీడాకారులు గోల్డ్ మెడల్ పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విష్ణు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు.

## ప్రతి ఒక్కరికీ ఓటు మనహక్కు

- **అర్హులైన వారంతా ఓటరుగా నమోదుచేసుకోవాలి..**
- **ఓటు హక్కు కోల్పోవద్దు..**
- **పార్టీ శ్రేణులు....**

కరీంనగర్/ జూలై 14/(జన సంఘర్షణ)



అర్హులైన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి.. ఓటు హక్కు కోల్పోవద్దు.. పార్టీ శ్రేణులు సమన్వయం చేసుకొని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చేలా చూడాలి! గౌరవనీయులు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం మేరకు సర్ ప్రోగ్రాం భాగంగా చేయడం జరిగింది. జై పొన్నం అన్న సాధన కొరకు ప్రోగ్రాం విచ్చేసిన సర్ తరఫున ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఆమె' స్థానంలో దర్జాగా..! హద్దు మీరుతున్న కొందరు 'సర్పంచ్ భర్తలు'

డిచ్పల్లి/జూలై14/(జన సంఘర్షణ)

స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళలు నామమాత్రంగా మారుతున్నారు. వారి కుటుంబ సభ్యులే 'అంతా తామై' పెత్తనం చెలాయిస్తున్నారు.

పంచాయతీ పాలనలో తమ 'మార్క్' చూపిస్తున్నారు. అధికారిక సమావేశాల్లో దర్జాగా ఆసీనులవుతూ.. అధికారులకు ఆదేశాలు సైతం ఇస్తున్నారు. గ్రామానికి ఓ మహిళా సర్పంచ్ ఉన్నదనే విషయాన్ని మైమరిపిస్తూ అసలు సిసలైన నేతలుగా చెలామణి అవుతున్నారు.

**డిచ్పల్లి మండలంలో....**


డిచ్‌పల్లి మండలంలో జాతీయ రహదారి పక్కనున్న ఓ గ్రామంలో మహిళా సర్పంచ్ భర్త.. పంచాయతీ పాలనలో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. పంచాయతీ పాలక వర్గ సమావేశంలో కూర్చుని ఆదేశాలు ఇస్తున్నాడు. ఏదైనా పని ఉంటే తన ఇంటికి వచ్చి కలవాలని సిబ్బందిపై అజమాయిషీ ప్రదర్శిస్తూ పెత్తనం చెలాయిస్తున్నాడు. తన మాట వినని సిబ్బందిపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడు. ఆ సర్పంచ్ భర్త వ్యవహార శైలిపై గ్రామస్థులు ఆగ్రహంతో ఉన్నారు.

**చట్టసభల్లో సగం... పాలనలో మాత్రం శూన్యం....**

ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. మహిళలు రాజకీయంగా ఎదగాలని, సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ గ్రామాలను ప్రగతి పథంలో నడపాలనేది ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. అయితే మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో భర్త జోక్యం మితిమీరిందని కలెక్టర్ ఏకంగా మహిళా సర్పంచ్‌ను సస్పెండ్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్గా మారింది.

**నిజామాబాద్ జిల్లాలోనూ...**

నిజామాబాద్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. 545 గ్రామ పంచాయతీలుండగా 249 మంది మహిళా సర్పంచులు ఎన్నికయ్యారు. ఇక్కడ మహిళలు పేరుకే సర్పంచులుగా... కానీ, తెర వెనుక, తెర ముందూ అంతా తామై నడిపిస్తోంది మాత్రం వారి భర్తలు, కుమారులే కావడం గమనార్హం. జిల్లాలోని మెజారిటీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సర్పంచుల పరిస్థితి కేవలం 'రబ్బరు స్టాంపు'లకే పరిమితమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మహిళా సర్పంచుల కోసం కేటాయించిన అధికారిక కుర్చీల్లో కొందరు వారి భర్తలు దర్జాగా కూర్చుని హుకూం జారీ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల భార్య కుర్చీ పక్కనే అంతకంటే పెద్ద కుర్చీ వేయించుకుని సమాంతర పాలన సాగిస్తున్నారు.



**తీర్మానాల్లో జోక్యం....**

గ్రామ పంచాయతీ తీర్మానాల రిజిస్టర్లలో సంతకాలు పెట్టడానికి మాత్రమే మహిళా సర్పంచులు కార్యాలయానికి వస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే భర్తలే సంతకాలను కూడా ఫోర్జరీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండల పరిషత్ సమావేశాలకు, జిల్లాస్థాయి రివ్యూ మీటింగ్‌లకు మహిళా సర్పంచులకు బదులుగా వారి భర్తలే హాజరవుతున్నారు. అధికారులు కూడా దీనిని చూసీచూడనట్లు వదిలేయడం ఈ సంస్కృతికి మరింత ఊతమిస్తోంది.

**పంచాయతీ సిబ్బందిపై వేధింపులు...**

సర్పంచుల భర్తల మితిమీరిన జోక్యంతో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, సఫాయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'మేం మహిళా సర్పంచ్‌కు నివేదిక ఇచ్చేందుకు వెళ్తే, ఆమె భర్త నివేదిక లాక్కుని మమ్మల్ని ప్రశ్నిస్తారు. ఆయన చెప్పినట్లు వినకుంటే ఎమ్మెల్యేకు చెప్పి బదిలీలు చేయిస్తామని బెదిరిస్తున్నారు.' అని కొందరు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అభివృద్ధి పనుల బిల్లుల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక, గ్రామ నిధుల దుర్వినియోగం వంటి విషయాల్లో భర్తల మాటే శాసనంగా మారింది. గ్రామ సభల్లో మహిళా సర్పంచ్‌లను మూలన కూర్చోబెట్టి, మైక్ పట్టుకుని భర్తలే ప్రసంగాలు దంచేస్తున్నారు. సర్పంచుల భర్తల ఆగడాలపై పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారులకు అంతర్గతంగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

**ఇంటెలిజెన్స్ నివేదికలు...**

మెదక్ జిల్లా పొలంపల్లి ఘటన నిజామాబాద్ జిల్లా యంత్రాంగాన్ని అలర్ట్ చేసింది. జిల్లాలోని పలు మండలాల్లో మహిళా సర్పంచుల భర్తల జోక్యంపై ఇంటెలిజెన్స్, పంచాయతీ రాజ్ శాఖ అంతర్గత నివేదికలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కడైనా భర్తల పెత్తనం కనిపిస్తే సదరు మహిళా సర్పంచ్‌లను సస్పెండ్ చేయాలని భావిస్తున్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎన్నుకోబడిన ప్రతినిధి మాత్రమే విధులను నిర్వహించాలి. సర్పంచ్ స్థానంలో ఇతరులు జోక్యం చేసుకుంటే అది చట్టవిరుద్ధం. జిల్లాలో 'సర్పంచ్ పతి'ల పెత్తనానికి చెక్ పెట్టకపోతే.. మహిళా రిజర్వేషన్ల ఆశయం అభాసుపాలు కావడం ఖాయం. ఇప్పటికైనా కలెక్టర్, పంచాయతీ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
బుధవారం
15 జులై 2026

# రామాయంపేట అభివృద్ధిని అడ్డుకున్న వారికే ఇప్పుడు మాట్లాడే హక్కు లేదు

◆ **బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 14 (జన సంఘర్షణ)

భారతీయ జనతా పార్టీ రామాయంపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, కౌన్సిలర్ శంకర్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు భానుచందర్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయంపేట జాతీయ రహదారి-44పై శ్రీ ఆద్య హోటల్ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి అప్పటికే జాతీయ రహదారుల శాఖ అధికారులు సానుకూలంగా ఉన్నప్పటికీ, అప్పటి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తమ అనుచరుల భూముల ప్రయోజనాల కోసం ఆ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు అదే నాయకులు వై-జంక్షన్ అంశంపై రాజకీయాలు చేయడం ప్రజలను మోసం చేయడమేనని, ఇది అత్యంత సిగ్గుచేటైన చర్య అని మండిపడ్డారు. రామాయంపేటలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల విషయాన్ని ఎంపీ ఎం. రఘునందన్ రావు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారని, ఆద్య హోటల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు. త్వరలోనే అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభమవుతుందని ఎంపీ హామీ ఇచ్చారని వెల్లడించారు. ఉమ్మడి రామాయంపేట మండలంలోని సహకార సంఘాల్లో జరిగిన భారీ అవినీతిని ప్రస్తావిస్తూ, కోనాపూర్ సహకార సంఘంలో కోట్ల రూపాయల





కుంభకోణం జరిగినప్పటికీ, విచారణ అనంతరం సుమారు రూ.2 కోట్ల రికవరీకి ఆదేశాలు వచ్చినా కోర్టు స్టే పేరుతో రైతుల డబ్బులను తిరిగి చెల్లించకుండా అడ్డుకోవడం దుర్మార్గమని విమర్శించారు. రైతుల సొమ్మును వెంటనే రికవరీ చేసి వారికి అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రామాయంపేట పీఏసీఎస్‌లో రూ.73 లక్షల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ చైర్మన్, డైరెక్టర్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కొట్టుకునే స్థాయికి దిగజారడం రైతు సమాజానికి అవమానకరమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన సహకార సంఘాలను అవినీతికి అడ్డాగా మార్చారని విమర్శించారు. ఈ రెండు సంఘాల్లో జరిగిన అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకుని ఒక్క రూపాయి కూడా మిగలకుండా రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. రామాయంపేట మున్సిపాలిటీలో జరిగిన రూ.1.60 కోట్ల కుంభకోణంపై బీజేపీ మొదటి నుంచే ధర్నాలు, నిరసనలు చేపట్టి కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు లేకపోవడం విచారకరమని అన్నారు. వెంటనే బాధ్యులపై కేసులు నమోదు చేసి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, అనంతరం కాంగ్రెస్ పాలనలో రామాయంపేట పట్టణం,మండలం పూర్తిగా అభివృద్ధికి దూరమైందని విమర్శించారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసిన పద్మా దేవేందర్ రెడ్డి ఒక్కసారి లక్ష్మాపూర్-దంతపల్లి రోడ్డుపై ప్రయాణిస్తే ప్రజలు పడుతున్న కష్టాలు అర్థమవుతాయని, గుంతలమయంగా మారిన ఆ రోడ్డును వెంటనే రెండు లేన్ల బీటీ రోడ్డుగా మంజూరు చేయాలని, స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు కూడా ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో, రైతుల సొమ్ముతో, ప్రజాధనంతో చెలగాటమాడిన వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, బీజేపీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుందని రాగి రాములు స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బీజేపీ కౌన్సిలర్ శంకర్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు భానుచందర్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య, యాదగిరి, పట్టణ సీనియర్ నాయకులు పబ్బ సత్యనారాయణ, అక్కన్నపేట మాజీ సర్పంచ్ సిద్ధ రాములు, యువమోర్చా నాయకులు సంతోష్, నాగరాజు, నితిన్ బాసం, అనిల్ కోమటిపల్లి, దయాకర్, మాజీ మండల అధ్యక్షుడు దయానంద్ రెడ్డి, లింగాపూర్ యేసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# డబ్బు ఇస్తే కోర్టుకు డూప్లికేట్ వ్యక్తి హాజరు


◆ **ఫేక్ చలాన్లతో రికార్డుల మాయాజాలం....**
◆ **జైలు భయాన్ని ఆసరాగా చేసుకుని భారీగా వసూళ్లు...**
◆ **ఒక్కో కేసులో రూ. 15 వేల నుంచి 30 వేల వసూల్...**
◆ **దర్యాప్తు సీపీ ఆదేశాల విచారణ.. ఒకరు సస్పెండ్, ఇద్దరిపై...**

కరీంనగర్/జూలై 14/( జనసంఘర్షణ)

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు అంటే అందరికీ భయం.. ఎందుకంటే రోడ్డు ప్రమాదాలలో చాలమటుకు మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపడం వలన జరుగుతున్నాయి. దానితో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపట్ల చట్టాలు కఠినంగా వ్యవహరించాలని గత ఎడాది పెను మార్పులు చేసింది. తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన రూ.10 వేల జరిమానా మొదలుకొని కొన్ని సార్లు మద్యం మోతాదు( పదే పదే డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే) 2 రోజుల నుంచి 10 రోజు వరకు జైలు శిక్ష అనుభవించాల్సిందే.. డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్ లో దొరికితే ఇక జరిమానా లేదా జైలుకు అనే భయం ప్రజలు పెరిగింది. దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు కొందరు ఖాకీలు. ఎకంగా న్యాయస్థానాలకు మస్కా కోరుతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వారి స్థానంలో ఇతరులను మందుబాబులు చూపించడంతో పాటు, పేక్ చలనాలతో ప్రభుత్వ ఆధాయంకు గండి కొడుతున్నారు.. ఇలాంటి వ్యవహారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. మద్యం తాగి వాహనం నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన కొందరు పోలీస్ సిబ్బంది ఇప్పుడు అక్రమ దందాకు పాల్పడడం కరీంనగర్ పోలీస్ శాఖలో ప్రకంపనలు సృష్టిస్తోంది.

డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడ్డ వారిని కోర్టుకు హాజరు కాకుండా చేస్తామని, జైలు శిక్ష పడకుండా చూస్తామని నమ్మబలికి, అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు పోలీసు వర్గాలు సంచలనంగా మారాయి. అసలు నిందితులు స్థానంలో ఇతరులను కోర్టుకు పంపడం, ఫేక్ చలాన్లతో రికార్డులు మాయం చేయడం వంటి వ్యవహారాలు పడుతుందనే భయాన్ని కొందరు సిబ్బంది తమకు అదనుగా మార్చుకున్నారు. "డబ్బులిస్తే కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదు, అన్నీ మేమే చూసుకుంటాం అని నమ్మబలికి ఒక్కో కేసు విషయంలో రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు చెల్లించిన వారి కోసం, వారి స్థానంలో కోర్టుకు హాజరయ్యే డూప్లికేట్ వ్యక్తులను సమకూర్చి న్యాయ ప్రక్రియను తప్పుదోవ పట్టించి నట్లు సమాచారం. గుర్తింపు పత్రాలు ధృవీకరణ కూడా అవకతవకలు జరిగాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో చలాన్ల జారీ విధానం ఎంత మొత్తం అక్రమ లావాదేవీలకు పాల్పడుతున్నారు? అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. అసలు నిందితులు స్థానంలో హాజరైన ఆ డూప్లికేట్ వ్యక్తులు ఎవరు? వారికి ఎవరు డబ్బులు ఇచ్చారు? అనే ప్రశ్నలకు ఇప్పుడు కమిటీ సమాధానాలు వెతుకుతోంది. బ్రీత్ అనలైజర్ రికార్డులను, కోర్టు హాజరు వివరాలు సరిపోల్చుతూ ఈ అవినీతి సామ్రాజ్యం ఎంత విస్తృతమైనదో బయటపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ అక్రమాలపై ఫిర్యాదులు అందటంతో పోలీస్ కమిషనర్ గౌడ్ ఆలం వెంటనే స్పందించారు. ఏఆర్ ఏసీపీ సి. ప్రతాప్ నేతృత్వంలో ముగ్గురు అధికారులతో ప్రత్యేక విచారణ కమిటీనిఇద్దరు కానిస్టేబుళ్లను హెడ్ క్వార్టర్స్ కు





అటాచ్ చేశారు. అందులో ఒక కానిస్టేబుల్ పై సస్పెన్షన్ వేటు పడగా, మిగతా వారిపై విచారణ కొనసాగుతోంది. ఈ అక్రమాల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదు" అని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. కేవలం ఒక కానిస్టేబుల్ సస్పెన్షన్ తో ఈ కేసు ముగిసిపోకూడదని, ఎన్ని కేసుల్లో ఈ విధంగా అక్రమాలు జరిగాయి, ఇందులో మరెవరి పాత్ర ఉంది? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. న్యాయ ప్రక్రియను అపహాస్యం చేసిన ఈ ఉదంతం, కరీంనగర్ పోలీసు శాఖలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

◆ **ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం**
◆ **ఎస్సీ, ఎస్టీ కేసుతో వేధింపులే కారణం?**
◆ **బాధితుడి కుటుంబ సభ్యుల ఆరోపణ**
◆ **విషమంగా బాధితుడు రాజేందర్ రెడ్డి పరిస్థితి..!**
◆ **మానకొండూరు నియోజకవర్గంలో ఉద్రిక్తత**

కరీంనగర్ మానకొండూరు/ జూలై 14/( జనసంఘర్షన)

కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త బేతల్లి రాజేందర్ రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మంగళవారం ఎల్ఎండీలోని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ఎదుట ఆయన తనపై తాను పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. స్థానికులు వెంటనే స్పందించి తీవ్ర గాయాలైన రాజేందర్ రెడ్డిని కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.



**వేధింపుల వల్లే అఘాయిత్యం..**

స్థానిక సమస్యలపై ప్రశ్నించినందుకే ఎమ్మెల్యే అనుచరుడు మురళీధర్ రెడ్డి తమ భర్తపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించాడని బాధితుడి భార్య ఆరోపించింది. ఆ కేసుతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేందర్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆమె తెలిపింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ఘటనతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) టెండర్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహణ

◆ **జరిగిందని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 14 (జన సంఘర్షణ)



జిల్లాలో గతంలో ఇచ్చిన ప్రకటన ఆధారంగా టెండర్ల కోడ్ చేసిన గుత్తేదారుల సమక్షంలో కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలోని (19) కే.జీ.బీ.వీలు, (06) తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల వసతిగృహాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చికెన్, మటన్, కూరగాయలు, ఫ్రూట్స్ కు సంబంధించి టెండర్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ లాటరీ ప్రక్రియ నిర్వహించి గుత్తేదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్ల కోడ్ చేసిన గుత్తేదారులు అంతే నాణ్యతతో కూడిన కూరగాయలు, ఫ్రూట్స్, చికెన్ ,మటన్ నాణ్యతతో కూడినవి సరఫరా చేయాలని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన గుత్తేదారులను బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ టెండర్ల నిర్వహణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి, వసతి గృహ సంక్షేమ అధికారులు, ప్రిన్సిపల్స్ గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మత్తులు చేసి రాత్రి వేళలో ప్రజల కష్టాలు తీరుస్తున్న పోలీస్

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం,జూలై 14( జనసంఘర్షణ):

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో రోడ్డు మరమ్మత్తులు కొనసాగుతున్నాయి. రోడ్డు మరమ్మత్తుల పనులు భాగంగా కాంట్రాక్టర్లు మరమ్మతులు చేసే ప్రదేశంలో ప్రమాద సూచికలు పెట్టాల్సి ఉండగా, ముందస్తు ప్రమాదాలు జరగకుండా రుద్రూరు పోలీసులు నడుం బిగించి మరమ్మత్తులు జరిగే ప్రదేశంలో దారిని బంద్ చేసే క్రమంలో రుద్రూర్ పోలీసులు నిమగ్నమయ్యారు. రోడ్డు మరమ్మతులు చేసే కాంట్రాక్టర్లు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వాహనపుదారులు ప్రయాణికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని దారిని బంద్ చేసి మంచి రోడ్డు వైపు దారిని మళ్ళించారు. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్లు దృష్టి పెట్టకపోవడం పోలీసులు స్పందించడం పట్ల శభాష్ పోలీసులు అంటూ జనం మెచ్చుకుంటున్నారు.






# ఆక్వా పార్కులో నిర్వాసిత స్థానిక మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

◆ **లేల్లెల బాలకృష్ణ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్**

మంచిర్యాల జిల్లా, హాజీపూర్ మండలం, జులై 14(జనసంఘర్షణ):



హాజీపూర్ మండలం నంన్నూరు గ్రామంలో నిర్వాసిత మత్స్యకార గ్రామాల ప్రజలతో బోయిరి రాజకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి లేల్లెల బాలకృష్ణ తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మచ్చ సంపద యోజన పథకం ద్వారా 2026,27 సంవత్సరం ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో సుమారు 100 కోట్ల రూపాయలతో 85 ఎకరాల స్థలంలో నిర్మాణం అవుతున్న ఆక్వా పార్క్ మత్స్య పరిశ్రమ చేపలు రొయ్యలు కొర్రమీను శుభ్రపరచడం ప్రాసెసింగ్ చేయడం విదేశాలకు విజ్ఞత చేసే పనులు మత్స్యకార యువత, మహిళలకు శిక్షణ సంస్థలు,భవన నిర్మాణం, ఫిష్ కోర్టులు, పర్యటక రంగం అభివృద్ధి పేరుతో స్థానిక స్వయం సహాయ బృందాలకు అవకాశాలు కల్పించడం చేస్తామన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో గుడి పేట, నశీన్నూరు, రాపల్లి, కర్ణ మామిడి గ్రామాల స్థానిక మత్స్యకారులకు ప్రధాన జీవనాధారం చేపల వృత్తి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సంయుక్తంగా నిర్మిస్తున్న ఆక్వా పార్కులో ఈ నాలుగు గ్రామాల మత్స్యకారులను భాగస్వామ్యం చేయాలని, యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆక్వా పార్కు నిర్మాణంలో ఇలాంటి అవకతవకులు జరగకుండా పారదర్శకంగా నిర్మించాలని, నాలుగు గ్రామాల నుంచి మత్స్యకారుల 25 మంది కమిటీని భాగస్వామ్యం చేయాలని, మత్స్యకారుల గ్రామాల్లో చాపల మార్కెట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోయిరి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు, మంచర్ల రాజేందర్ జిల్లా అధ్యక్షులు, బోడంకి చందు జిల్లా కార్యదర్శి, జునవరి నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు, గగ్గురి రాజన్న జిల్లా సహాయ కార్యదర్శి, బోయిరి రాజకుమార్ జిల్లా నాయకులు, మత్స్యకారులు జునగారి మల్లేష్, మొగుళ్ళ మహేష్, బొగ్గుల చంద్రశేఖర్, రాకేష్, జునగాని గణేష్, ఉట్నూరి రాజ నర్సు, తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.

# నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం చేసిన వారమవుతాం

**❑ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 14 (జన సంఘర్షణ)



కోర్టు--పోలీసు సమన్వయంతో బాధితులకు సత్వర న్యాయం అందించాలి. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కోర్టు--పోలీసు సమన్వయ సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మాట్లాడుతూ.. నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం చేసిన వారమవుతామని అన్నారు. అందుకు ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ సాక్ష్యాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్, కోర్టు-పోలీసు శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులు కోర్టు డ్యూటీ అధికారులు విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. కోర్టు లైజనింగ్ అధికారి న్యాయవ్యవస్థకు, పోలీసు శాఖకు మధ్య సమర్థవంతమైన వారధిగా వ్యవహరించాలని, కేసుల విచారణకు సంబంధించిన సమాచారం, సమన్లు, వారెంట్లు, ఇతర కోర్టు ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులకు చేరవేసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే కోర్టు సమన్లు, వారెంట్లను సకాలంలో అమలు చేయడం, చార్జిషీట్లు, కేసు డైరీలు, ఇతర సంబంధిత పత్రాలను నిబంధనల ప్రకారం కోర్టుకు సమర్పించడం ద్వారా కేసుల విచారణ వేగవంతమై నిందితులకు శిక్షలు పడే అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. శాస్త్రీయ దర్యాప్తు, పటిష్ఠమైన సాక్ష్యాల సేకరణ, సమర్థవంతమైన కోర్టు-పోలీసు సమన్వయంతోనే న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాధితులకు సత్వర న్యాయం అందించడమే మెదక్ జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని అన్నారు. పోలీసు శాఖ, న్యాయవ్యవస్థ సమన్వయంతో ఈ సంవత్సరం మెదక్ జిల్లాలో 20 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యేలా చేయగలిగామని తెలిపారు. వాటిలో 12 కేసుల్లో జీవిత ఖైదు, 5 కేసుల్లో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షలు, మరో 3 కేసుల్లో 7 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ కారాగార శిక్షలు ఖరారయ్యాయని, తద్వారా బాధితులకు న్యాయం అందించగలిగామని పేర్కొన్నారు. ఈ విజయాలు నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ సాక్ష్యాల సేకరణ, ఫోరెన్సిక్ ఆధారాల వినియోగం, సమయానికి చార్జిషీట్లు దాఖలు చేయడం, కోర్టులో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ ఫలితమేనని తెలిపారు. ప్రతి దర్యాప్తు అధికారి కేసులను అత్యంత నిబద్ధతతో దర్యాప్తు చేసి, నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. కోర్టు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే నేరస్థులకు శిక్షలు ఖరారై బాధితులకు పూర్తి న్యాయం అందుతుందని, ఈ దిశగా మెదక్ జిల్లా పోలీసులు న్యాయవ్యవస్థతో కలిసి నిరంతరం పనిచేస్తారని ఎస్పీ తెలిపారు. చివరగా, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, సీఐలు మహేష్, రేణుక, రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, జార్జ్, రంగకృష్ణ, వెంకటరాజ గౌడ్, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు, అధికారులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు

**❑ ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...**

హైదరాబాద్ /జూలై 14/( జనసంఘర్షణ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి . హైదరాబాద్‌కు ఐఐఎం ను తీసుకురావాలి... ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలి. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలి. ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ఆర్ఆర్ఆర్ ను పూర్తి చేసుకోవాలి. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలి. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్‌తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి చీూజ ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఎన్ఓసీ ఇవ్వాల్సి ఉంది. ఎన్ఓసీ అంశం చర్చల దశలో ఉంది... ఈ విషయంలో కేంద్రం కూడా చొరవ చూపాలిజ 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్,



వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలి.

# భాగ్య, హన్నమ్మ మామూలు లేడీస్ కాదమ్మ..

**❑ బస్టాండ్‌లో వాళ్ల కంట పడ్డారో అంతే సంగతులు**

ఆంధ్రప్రదేశ్/జులై 14 /(జనసంఘర్షణ)

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత బస్సుల్లో రద్దీ పెరిగిన నేపథ్యంలో, దొంగలు కూడా దీనిని అవకాశంగా మలుచుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఇద్దరు మహిళల మెడలోని బంగారు గొలుసులను చోరీ చేసిన తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళా దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్రాలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఇతర రాష్ట్రాల మహిళలు అవకాశంగా తీసుకుంటున్నారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎక్కడ చూసినా మహిళలు పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. ఈ అవకాశాన్ని గమనించిన ఇతర రాష్ట్రాల దొంగలు ఏపీలోకి చొరబడ్డారు. ఎక్కడైతే ఉచిత బస్సుకు మహిళల నుంచి డిమాండ్ అధికంగా ఉందో అక్కడ తిష్ట వేస్తున్నారు. అయితే.. ఎందుకు అనుకుంటున్నారా..? ప్రయాణికుల నుంచి ఆభరణాలను, డబ్బులనుదొంగలించేందుకు.. అవును.. అలా తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలు బంగారం దొంగలించి.. చివరకు కటకటాల పాలయ్యారు. బంగారానికి ఇప్పుడు భారీగా ధర పెరిగిన సంగతి తెలిసిందే. ఇలాంటి బంగారు చైన్లు వేసుకున్న మహిళలు ఉచిత బస్సు కోసం ఎక్కేటప్పుడు దిగేటప్పుడు ప్రయాణికుల మాటున వేచి ఉండి మహిళా దొంగలు తమ పని సులభంగా చేసుకుంటున్నారు. మహిళా ప్రయాణికులతో కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా ఉంటుందని మహిళా దొంగలు తిష్ట వేసినట్లు పోలీసులు చెబుతున్నారు. గతంలో కూడా ఇదే బస్టాండ్లో ఇలాంటి బంగారు చోరీలు జరిగాయి.

తాజాగా.. ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణానికి చెందిన వెంకటేశ్వరమ్మ.. కర్నూలు ఏ. క్యాంపులో నివాసం ఉంటున్న తన కుమారుడు వెంకటేశ్వరులను చూసేందుకు పట్టణానికి వచ్చింది.. అలా కర్నూలు వచ్చి తిరిగి గిద్దలూరు వెళ్లేందుకు గత నెల 11న బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తుండగా.. ఆమె మెడలోని బంగారు గొలుసు మాయమైంది. బంగారు గొలుసు లేదనే విషయం తెలుసుకుని స్థానిక నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే పెద్దపాడుకు చెందిన బ్యాంక్ మహిళా ఉద్యోగి కూడా అదే రోజు విధులకు వెళ్ళేందుకు బస్సు కోసం బస్టాండ్ లో వేచి ఉండగా ఆమె మెడలోని బంగారు గొలుసును కూడా చోరీ చేశారు. దీంతో ఆమె కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది..




**తమిళనాడు నుంచి వచ్చి.....**

ఇద్దరు మహిళా బాధితుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు బస్టాండ్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ క్రమంలోనే.. అనుమానం వచ్చి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు మహిళలను విచారించగా వారిది తమిళనాడు రాష్ట్రంలోని జోలార్ పేటకు చెందిన భాగ్య, హన్నమ్మలుగా గుర్తించారు. బెంగళూరు శివార్లలోని కుప్పం ప్రాంతంలో వారు సంచరిస్తున్నట్లు గుర్తించి పోలీస్ టీం అప్రమత్తమైంది. ఈ క్రమంలోనే.. కుప్పం ప్యాలెస్ రోడ్డులో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. చోరీకి గురైన 6:30 తులాల బంగారు చైన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళా దొంగలను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ కు తరలించారు. అయితే.. బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని.. అజాగ్రత్తగా ఉంటే ఇలాంటి సంఘటనలే జరుగుతాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం

**❑ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం నియోజకవర్గం, జులై 14(జనసంఘర్షణ):



భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తూ అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేసిన చెక్కుల వివరాలు, పానుగంటి అనసూయ కు రూపాయలు 45,000 వెంకటాపురం మండలం ఏకన గూడెం గ్రామం, లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పులి గోర్లు, దంతాలు స్వాధీనం..

**❑ దుబ్బాకలో పులి కళేబారాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు వెల్లడి..**

ఇందల్వాయి,/జూలై 14/ (జన సంఘర్షణ)



ఇందల్వాయి అటవి రేంజ్ పరిధిలోని దుబ్బాక గ్రామంలో పులి కళేబరాన్ని ఇందల్వాయి అటవి రేంజ్ అధికారి రవి మోహన్ బటర్ ఆధ్వర్యంలో ఆటవిశాఖ అధికారులు వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్నటువంటి బావిలో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుగుతున్నట్లు సమాచారం. దీంతో పాటు నిధుల వద్ద పులి గోర్లు, దంతాలు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలో పులులు సంచరిస్తున్న ప్రాంతాలను వేటగాళ్లు వలపన్నీ మాటు వేస్తూ పులి చర్మం తో పాటు గోర్లు, దంతాలకు డిమాండ్ నేపథ్యంలో వాటిని హతమార్చి వేటగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది. ఈ మేరకు పోలీసులు అటవిశాఖ అధికారులు కేసులు నమోదు చేసుకొని వేటగాళ్లపై ఉక్కు పాదం మోపుతున్నారని తెలుస్తుంది.

# బాబన్నా పహాడ్ ప్రాంతంలో ఎన్ఫోర్స్ మెంట్ టీం దాడులు

**❑ 152 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం**

నిజామాబాద్ ప్రతినిధి/జూలై 14/( జన సంఘర్షణ)



నిజామాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబన్నా పహాడ్ ప్రాంతంలో ఎన్ఫోర్స్ మెంట్ టీం అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 152 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి రవాణాకు ఉపయోగించిన ఒక బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం, సంబంధిత కేసు పత్రాలు, నిందితుడిని తదుపరి న్యాయపరమైన చర్యల నిమిత్తం నిజామాబాద్ ఎస్హెచ్ఓకు అప్పగించారు.

# ఫేస్‌బుక్‌లో పాత నాణేలు,పాత నోట్లు

కామారెడ్డి ,మాచారెడ్డి / జూలై 14 ( జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కపూర్ గ్రామానికి చెందిన బెల్లపు కొమురయ్య సోషల్ మీడియా వేదిక అయిన ఫేస్‌బుక్‌లో "పాత నాణేలు, పాత నోట్లు ఉంటే వాటిని కొనుగోలు చేసి అధిక మొత్తంలో డబ్బులు చెల్లిస్తాము" అనే ప్రకటనను చూసి నమ్మాడు. అందులో ఇచ్చిన సంప్రదింపు నంబర్లకు ఫోన్ చేయగా, సైబర్ నేరస్థులు అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశ చూపి వివిధ బ్యాంకు ఖాతాలు, స్కానర్ (క్యూఆర్ కోడ్) ద్వారా విడతల వారీగా సుమారు రూ.64,000 చెల్లింపులు చేయించుకొని మోసం చేశారు. అనంతరం మరింత డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు బాధితుడు గుర్తించాడు. వెంటనే బాధితుడు జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదు ఆధారంగా మాచారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారూ సోషల్ మీడియాలో వచ్చే అధిక లాభాలు, పాత నాణేలు లేదా నోట్లకు భారీ మొత్తంలో డబ్బులు ఇస్తామని చెప్పే ప్రకటనలను నమ్మవద్దు. తెలియని వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు లేదా క్యూఆర్ కోడ్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు పంపించవద్దు. ఏదైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.

## కుర్ల ఇసుక క్వారీలోకి అన్ని గ్రామాల ట్రాక్టర్లకు అవకాశం కల్పించండి

- డోంగ్లి తహసిల్దార్ కు మండల సర్పంచులు వినతి.....

డోంగ్లి మద్నూర్/జూలై 14/( జన సంఘర్షణ)




మద్నూర్, డోంగ్లి మండలాల పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుక సరఫరాలో కుర్లా గ్రామస్తులు అజమయిషీ చెలాయిస్తున్నారని అన్ని గ్రామాల సర్పంచులు అన్నారు. ఇంతకు ముందు ఇసుక క్వారీలోకి అన్ని గ్రామాల ట్రాక్టర్లకు అనుమతులు లభించేవని తెలిపారు. తాజాగా మంగళవారం డోంగ్లీ మండల సర్పంచులు సంయుక్తంగా తహశీల్దార్ రంజిత్ కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు కృషితో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు కలగకుండా డోంగ్లి మండలంలోని కుర్లా గ్రామ శివారు ప్రాంతంలోని మంజీరా నది నుండి ఇసుకను తరలించడానికి ప్రభుత్వం ద్వారా ప్రత్యేకంగా ఇసుక క్వారీ ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కుర్లా గ్రామాస్తులు మాత్రమే మంజీరా నది నుంచి ఇసుకను తీసుకుంటామని అంటున్నారని, ఇది ఎంత వరకు సబబు అని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే ఊరు ట్రాక్టర్లను ఇసుక క్వారీలోకి రాకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. మండల పరిధిలో నిర్మిస్తున్న ఇందరమ్మ ఇండ్లు సకాలంలో పూర్తి కావాలంటే ఇసుక క్వారీలోకి అన్ని గ్రామాల ట్రాక్టర్లను అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యూనుస్ పటేల్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బాచవార్ లక్ష్మణ్, మండలంలోని సర్పంచులు హాలే బస్వంత్, సంగ్రామ్ పటేల్, శ్రీధర్, శ్రీకాంత్, దత్తు, నాయకులు విలాస్, శివారెడ్డి, పలువురు ట్రాక్టర్ యజమానులు ప్రజలు పాల్గొన్నారు.

## పాల్వంచ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మైనర్లపై జరుగు నేరాలు తీసుకోవలిసిన జాగ్రత్తలు

- ప్రేమలు మోసాలు-మైనర్ డ్రైవింగ్-మాదక ద్రవ్యాల నిర్మూలన-సైబర్ నేరాలు

కామారెడ్డి , మాచరెడ్డి,/జూలై 14 ( జన సంఘర్షణ )






కామారెడ్డి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.రాజేష్ చంద్ర ఐపీయస్ ఆదేశానుసారం మాచారెడ్డి సబ్-ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ సార్ చూచన మేరకు ఏఎస్ఐ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందంచే అవగాహనా కార్యక్రమం సైబర్ నేరాల టోల్ ఫ్రీ నం 1930 మాదక ద్రవ్యాల టోల్ ఫ్రీ నం 1908 షి టీమ్ నం 8712686094 అత్యవసర సమయంలో డైల్ 100/112 కాల్ చేయాలని, ఇంస్టాగ్రామ్ ఫేస్ బుక్ సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని, మంచి లక్ష్యంతో చదువు కోవాలని ఏచిన్న పొరపాటు చేసిన జీవితాలు నాశనం అవుతాయని. తల్లి తండ్రులు, గురువులు చెప్పినట్టు వినాలని, పోలీస్ కళాబృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్.రామంచ తిరుపతి హెడ్ కానిస్టేబుల్ యు.శేషరావు పిసిలు.ప్రభాకర్ సాయిలు మాటలు పాటలు ద్వారా కార్యక్రమం చేయడమైనది. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన పీసీ రాజేందర్ వివరించారు. బ్లూ కోట్స్ పీసీ.గంగాధర్, హెచ్‌జీ. భాస్కర్. రమేష్. రాంచంద్రం, ఉపధ్యాయు బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తే ఖబర్దార్

డోంగ్లి మద్నూర్ /జూలై 14/( జనసంఘర్షణ)



డోంగ్లి మండల పరిధిలోని ఎనబోరా గ్రామ అభివృద్ధి విషయంలో ఒక వ్యక్తి సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారనీ, ఆ వ్యక్తిపై ఆ గ్రామ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులైన యూనుస్ పటేల్ తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం డోంగ్లీ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నియోజకవర్గం వ్యాప్తంగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. ఎనాబొర నుంచి రాజన్న ఆలయం వరకు మొర్రంరోడ్డు, గ్రామాల్లో దాదాపుగా రూ. 50 లక్షల నిధులతో సీసీరోడ్ల నిర్మాణాలు, రూ. 10 లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణం, 40 ఇందిరమ్మ ఇండ్లతో పాటు అదనంగా మరో 15 ఇండ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ గ్రామం కూడా అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కండ్లు తెరిచి చూడాలని, ఊరికే ఇంట్లో కూర్చుని తప్పుడు పోస్టులు పెడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీపైనా.. స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుపై తప్పుడు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో డోంగ్లి మండల సర్పంచుల సంఘం ప్రెసిడెంట్ బాచావార్ లక్ష్మణ్ పటేల్, మండల సర్పంచులు హళ్ళే బస్వంత్, సంగ్రామ్ పటేల్, దత్తు, శ్రీధర్, శ్రీకాంత్, నాయకులు చాంద్ పటేల్, ధనుజయే పటేల్, దిన్దయాల్, ప్రవీణ్ పటేల్, విలాస్, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

- ప్రేమ వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య..
- నిందితుడిపై చర్యలు కోరుతూ బంధువుల ఆందోళన

మంచిర్యాల/, జూలై 14:/(జన సంఘర్షణ)



మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో వేధింపులకు గురవుతున్నాననే మనస్తాపంతో మాధవి అనే యువతి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వెంకటేష్ అనే సింగరేణి ఉద్యోగి వేధింపులే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు వెంకటేష్పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గమనిక: ప్రస్తుతం కుటుంబ సభ్యుల ఆరోపణల ఆధారంగా ఈ సమాచారం వెలువడింది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

## ఆబడిలో ఒక్క విద్యార్థి.. అతడికోసం టీచర్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బంది సేవలు

వరంగల్ జిల్లా, /జూలై 14 /(జన సంఘర్షణ)




వర్ధన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న పరిస్థితికి అద్దం పట్టే ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని కోనాపురం ప్రాథమిక పాఠశాలలో కనిపిస్తోంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం ఒకే ఒక్క విద్యార్థి చదువుతుండగా, అతడి కోసం ఉపాధ్యాయుడితో పాటు వంట మనిషి, పనిమనిషి సేవలు అందిస్తున్నారు.

కోనాపురం గ్రామానికి చెందిన ఈరెల్లి ప్రవీణ్ కుమారుడు ఈరెల్లి విక్కీపాల్ ఈ పాఠశాలలో రెండో తరగతి తెలుగు మాధ్యమంలో చదువుతున్న ఏకైక విద్యార్థి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఏకోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జగన్మోహన్ రావు విక్కీపాల్‌కు అన్ని సబ్జెక్టులను స్వయంగా బోధిస్తున్నారు. బాలుడు ఏదైనా రోజు పాఠశాలకు రాకపోతే ఇంటికి వెళ్లి అతడిని బుజ్జగించి తీసుకురావాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఒకప్పుడు ఈ పాఠశాలలో సుమారు 20 మంది విద్యార్థులు చదివేవారు. అయితే గ్రామంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో కుటుంబాలు పట్టణాలకు వలస వెళ్లాయి. దీంతో పిల్లలు కూడా తల్లిదండ్రులతో పాటు వెళ్లిపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. గత విద్యా సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులు ఉండగా, వారిలో ఇద్దరూ వలస వెళ్లడంతో ఈ విద్యా సంవత్సరంలో విక్కీపాల్ ఒక్కరే మిగిలిపోయాడు. ప్రస్తుతం ఈ ఒక్క విద్యార్థి కోసం ప్రధానోపాధ్యాయుడితో పాటు మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట మనిషి పాఠశాల నిర్వహణ చూసుకునే పనిమనిషి విధులు నిర్వహిస్తున్నారు. అంటే ఒక్క విద్యార్థికి మొత్తం ముగ్గురు సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఈ పాఠశాల నిర్వహణ కోసం ప్రతి నెల సుమారు రూ. లక్ష వరకు ఖర్చవుతోందని ప్రధానోపాధ్యాయుడు వెల్లడించారు. గ్రామంలో ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి మెరుగుపడితే వలసలు తగ్గి, పిల్లలు తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. లేదంటే విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అక్రిడేటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50% ఫీజు రాయితీ కల్పించాలి

- మండల విద్యాశాఖ అధికారి కి వినతి పత్రం సమర్పించిన టియుడబ్ల్యూజె (ఐజేయు) నాయకులు.

భద్రాచలం /జూలై 14 /(జనసంఘర్షణ)




ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అనేక మంది వర్కింగ్ జర్నలిస్టులు పరిమిత ఆదాయంతో కుటుంబాలను పోషిస్తూ పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను భరించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టియుడబ్ల్యూజె (ఐజేయు) పట్టణ అధ్యక్షులు విజ్జగిరి రాజా కిరణ్, భద్రాచలం డివిజన్ ప్రింట్‌డఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు భూక్యా రంజిత్,ఎల్. శ్రీహరి కుమార్ అన్నారు. జిల్లా కమిటీ సూచనల మేరకు పట్టణంలోని అక్రిడేషన్ కార్డు కలిగిన జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజులో 50 % రాయితీ కల్పించాలని కోరుతూ టియుడబ్ల్యూజె (ఐజేయు) భద్రాచలం డివిజన్ కమిటీ, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి టి. రమాదేవిని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఫీజు రాయితీ అంశంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులతో చర్చించి జర్నలిస్టుల పిల్లలకు 50 % రాయితీ కల్పించే విధంగా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ కార్యదర్శి జె. జయరాం, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు కాటా సత్యం, సహాయ కార్యదర్శి బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు మదార్, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. ప్రేమ్ కుమార్, కోశాధికారి బి. నాయుడు, ఆర్. వెంకట్, పి.నాగేంద్రబాబు, యం.సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ కోలుకోవాలని పూల చైతన్య ఆధ్వర్యంలో ప్రత్యంగిరా మృత్యుంజయ హోమం

బంగారుపాళ్యం-జూలై 14 (జనసంఘర్షణ)



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మడుపోలూరు సమీపంలోని వసంతాపురం గ్రామంలో వెలసిన శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి అమావాస్య పూజలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతికి శస్త్ర చికిత్స చేసుకొని ఉన్న విషయం విదితమే ఆయన త్వరగా కోలుకోవాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల చైతన్య మోహన్ రాయల్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు జనసేన నాయకులు నాగరాజు, మురాదు భార్గవ్, పవన్, నాని, రమేశ్ ఆలయం ధర్మకర్త శివాజీ స్వామి, టిడిపి నాయకులు శివరాజ్, బాల, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co